స్వప్న భంగం

1

హిమవత్పర్వతశిఖరాలపై వసంత సాయంసంధ్యాకిరణాలు బంగారు గొడుగు లెత్తి పట్టుకొన్నాయి. కొండచరియలపై కమ్ముకొన్న పొగ మంచులో పైడి వానల జల్లులే కురిపించాయి. పురివిప్పి ఆడే నీలి నీలి నెమళ్ళు సంజవెలుగులలో పసుపుపచ్చని మేలిముసుగులు ధరించాయి. వెన్నెల వెలుగులు విరజిమ్మే చమరీమృగాల వాలాలే ఆ వెలుగులలో సువర్ణచామరాలై సంచలించాయి.

ఆ ప్రశాంత వసంత సాయంసంధ్య వేళలో హిమవత్పర్వత పరిసరాలన్నీ కాంచన గంగా ప్రవాహాల వెల్లువలు ముంచెత్తినట్లయి ఒక విచిత్ర స్వప్నలోక విభ్రాంతి కలిగించాయి.

ఆ సంజవేళ వరూధిని తన భవనోద్యాన వనంలో పూలపాన్పుపై మేనువాల్చి, నిశ్చల దృష్టితో సంజ వెలుగుల సొగసులు పరిశీలించింది. ఆమె కనుగొలుకులలో వేడి వేడి కన్నీటి బిందువులు సన్నని జాలులై ప్రవహించాయి.

అంతలోనే నేలపై రాలిన దేవదారు పర్ణాలలో కలకలస్వనం చెలరేగింది. వరూధిని అప్రయత్నంగా అటువైపు చూచింది. కాని ఎవ్వరూ అక్కడికి నడిచి వచ్చిన జాడ కనిపించలేదు. మళ్ళీ ఉసూరుమని ఒక దీర్ఘ నిశ్శ్వాసం విడిచిపెట్టింది. వెంటనే ఆమె కన్నులనుండి వేడివేడి కన్నీరు జలజలా ప్రవహించింది.

ఆనాడు జరిగిన సంఘటనలు తలుచుకొన్నకొద్దీ ఆమె హృదయం దారుణ సంతాపాగ్నిలో మగ్గి బుగ్గి అయిపోయింది.

"భూసురవర్యా! మదనవేదనలో వాడి వత్తలయి, దైన్యం మూర్తీభవించిన చూపులతో చేయిపై చెక్కిలి ఆన్చి, పైగాలి సోకినంతనే వెన్నవలె కరిగిపోయే అలివేణులను బిగికౌగిట జేర్చే మహాభాగ్యం ఎన్ని జన్మలకు కలుగుతుందయ్యా! ఒక్క మా రాలోచించుకోవయ్యా!"

అని దీనాతిదీన ముఖంతో ఎన్నెన్నోమారులు ప్రార్థించింది. కరుణించి ప్రాణాలు నిలపవలసిందని ప్రాధేయపడింది.

అయినా ప్రవరు డామె ప్రార్థన చెవికెక్కనీయలేదు. ఎంతసేపూ అరుణాస్పదపురానికి దారి చూపించవలసిందన్న ఘోషే!

అతని తిరస్కారంతో ఆమె కొక్కమారుగా తలకొట్టివేసినట్లయింది. అయినా ఇంకా ఎన్నెన్నో విధాల చెప్పి చూచింది. ఎన్నెన్నో విధాల ప్రాధేయపడింది. ఆ తిరస్కారావమాన భారంలో నిలువునా కుంగిపోయింది.

అంతలో ఆమె పౌరుషం తోక తొక్కిన తాచులా కస్సుమని పడగెత్తి బుసకొట్టింది. ఆ అవమానం ఆమె కిక దుర్భరమైపోయింది. మరి తాళలేక నిలుచున్నపాటుగా ప్రవరుణ్ణి గాఢంగా కౌగలించుకొన్నది. అతని పెదవి ముద్దుపెట్టుకోబోయింది.

దానితో అతడు 'హరి హరీ!' అని ముఖం ఇంకొక పక్కకు తిప్పివేసుకొన్నాడు. ఆమె నొక్కమారుగా వెనక్కి తోసివేశాడు. దానితో ఆ వరూధిని నేలపై కూలిపోవలిసిందే! కాని ఎలాగో అలాగ కాలు నిలువదొక్కకొని నిలబడింది. అయితే ఆమె పాదాల కింది నేల పాతాళంలోనికి దిగజారిపోయింది! హృదయం నీరైపోయింది. అయినా ధైర్యం చిక్కబట్టుకొని గద్గద స్వరంతో తిరిగీ ఎన్నెన్నో విధాల ప్రాధేయపడింది.

"ఎన్నెన్నో యజ్ఞయాగాదులు చేశానన్నావే! ఇంతమాత్రం దయాదాక్షిణ్యాలు లేని నీ వెన్ని యజ్ఞయాగాలు చేస్తేమాత్రం ఏమి ప్రయోజనం?" అని సూటిగా ఎత్తి పొడిచింది.

అయినా అతని మనస్సు కొంచెమైనా కరగలేదు. ప్రవరు డామె మేని జవాది పరిమళం సోకిన హృదయభాగం అంతా పక్కనే ప్రవహించే కొండ కాలవనీటితో పరిశుభ్రంగా కడిగివేసుకొన్నాడు! ముమ్మా రాచ

మించి పవిత్ర మంత్రోదకం శిరస్సుపై చల్లుకొన్నాడు! ఒక్కమారైనా వెనక్కి తిరిగి చూడకుండా పరిసర దేవదారువనంలో పడి అదృశ్యుడైనాడు.

అంతటి అవమానం భరించలేక ఆమె వెంటనే ఉరిపోసుకొని ప్రాణపరిత్యాగం చెయ్యవలెనని నిశ్చయించింది. అంతలోనే ఆమెకు తాను దేవకాంతనన్న విషయం స్ఫురణకు వచ్చింది. 'అయ్యో! నాకు మరణించే అదృష్టమైనా లేకపోయెనే!' అని దిగులుపడిపోయింది.

"ప్రాణేశ్వరు లొక్కింత చిన్నచూపు చూచినంత మాత్రాన మర్త్యకాంత లిట్టే ప్రాణపరిత్యాగం చేసివేస్తారే! వా రెంతటి అదృష్టవంతులు!" అని వారి అదృష్టం తలుచుకుని తిరిగీ ఒక సుదీర్ఘ నిశ్వాసం విడిచిపెట్టింది.

ఆ పరిసరాలలో మళ్ళీ కలకల స్వనం చెలరేగింది. సన్నని వేడి వేడి సుడిగాలి దేవదారు పర్ణాలలో గిరగిరా తిరిగిందేమో! ఆమె కెవరో తనవైపే నడిచివస్తున్నట్టు స్ఫురించింది! కాని అది సుడిగాలికాదు. ఆమె చెలికత్తె హరిణి!

హరిణి లేడిపిల్లలా చెంగు చెంగున గంతులు వేసుకుంటూ క్షణంలో వరూధిని దగ్గిరికి వచ్చి ఆమె పక్కనే కూర్చుంది. వరూధిని ననేక విధాలుగా బుజ్జగించి చెలికత్తెలందరూ వాహ్యాళికి బయలుదేరుతున్నారనీ,తనతో కలిసి రావలసిందనీ పట్టుపట్టింది. వారందరి ఆనందము, తన దురంత వేదన తలుచుకునేసరికి వరూధిని లోపలి దుఃఖం పొంగి పొంగి పైకుబికింది.

"అయ్యో వెర్రిదానా!ఆ బ్రాహ్మణ కుమారు డేమైనా ఇంద్రుడా, చంద్రుడా? ఏదో అమాయకుడు, ఛాందసుడు కనక ఆ సమయంలో ఆ విధంగా బెంబేలుపడి ఉంటాడు. అంతేగాని నీ అందము, చందము చూచినవా రింకెవరైనా ఒక్క క్షణమైనా మనసు నిలవరించుకోగలరా? ఎందుకే నీ కింత బేలతనం?"

అని హరిణి ఇంకొకమా రామెకు ధైర్యం చెప్పింది.

"ఎంతటి అందగత్తె అయినా తనంతట తానై వలచిన వనిత ఎవరి

కైనా తెలికేగదా!" అని చెలికత్తె అన్న మాటలకు వరూధిని చెప్పి చెప్ప నట్టుగా ఒక సమాధానం చెప్పింది.

మళ్ళీ హరిణి అందుకుంది:

"కాకపోయినా ఊరికే ఉత్తపుణ్యానికే నీ వింత దిగులు పడిపోతు న్నావే! ఆ వంట ఇంటి కుందేలిక ఎక్కడికి పోతుంది?అత డీ పరిసరంలోనే ఎక్కడో ఏ పొదరింటిలోనో కొంచెం విశ్రమించి ఉంటాడులే! అంతే గాని ఇంకెక్కడికి పోగలడు? ఒక మారు చూచి వత్తాము, లేచిరా!"

హరిణి ఆమెను బలవంతంగా లేవదీసి కూర్చోబెట్టింది. చెదిరిన ముంగురులు సరిదిద్ది చెయ్యి పట్టుకుని లేవదీసింది. పిమ్మట వారిద్దరూ కొంత దూరం నడిచివెళ్ళారు. వారి కనతి దూరంలోనే చెలికత్తెల నవ్వుల కల కలాలు వినిపించాయి. అంతలోనే మంజుఘోష తొందరగా వారి దగ్గి రికి పరుగెత్తుకు వచ్చి వరూధిని చెవిలో ఏదో ఊదింది. వరూధిని ఆ మాట నమ్మలేదు!

"ఊరికే నన్నేడిపించడానికే అంటున్నావు,అంతే! నే నమ్మను!" అని నిట్టూర్చింది.

"పోనీ, నీ కళ్ళారా చూస్తే నమ్ముతావా?" వరూధిని మరి మాట్లాడలేదు. "అయితే రా!" అని మంజుఘోష ఆమె నొక చిన్న కొండ చరియమీదికి తీసుకుపోయింది.

"ఆ పువ్వులు కోసే అందగాడెవరో చూడు!" అని వేలెత్తి చూపించింది. వరూధిని రెప్పపాటు లేకుండా అటువైపు చూచింది. ఆమె కెదురుగా అనతి దూరంలో కనిపించినవా డచ్చంగా ముమ్మూర్తులా ప్రవరుడే!

వరూధిని అలాగే శిలా ప్రతిమలా నిలబడిపోయింది!

2

ప్రవరుడు పట్టుతోరం కట్టిన ముంజేతి మెరుపులతో నెమ్మది నెమ్మదిగా పువ్వులు కోస్తున్నాడు. కిన్నెర కంఠంతో సామవేదం గానం చేస్తు

స్నాడు. ఆ వేదగానం దూరంనించి భ్రమరీ ఝుంకారంలా వరూధిని కర్ణ కుహరంలో మారుమోగింది. 'ఆహా! ఎంత మనోహర సామగీతి!' అని వరూధిని ఆ గానమాధురితో లీనమైపోయింది.

మంజుఘోష రెండుమూడుమార్లు లామె భుజంపై తట్టింది. ఆ తన్మయంలో వరూధిని అది గమనించనే లేదు. మంజుఘోష మళ్ళీ గట్టిగా తట్టింది. వరూధిని వెనక్కి తిరిగి చూచింది.

"ఏం! నేను చెప్పినది నిజమేనా?" కొంటెగా అడిగింది మంజుఘోష.

"నిజమేగాని, ఆటవికవనిత లెవరో ఆయన ఆకాశాని కెగసి అదృశ్యుడైపోయాడని అన్నారే!" అని అలాగే విస్తుపోయింది వరూధిని.

"ఆటవిక లమాయికులు! - నీకు వాళ్ళ మాటలే నచ్చాయిగాని ఇంకా నా మాటలమీద నమ్మకం కలగ నేలేదన్నమాట! అయితే నీవే స్వయంగా ఆయనతో ప్రసంగించివద్దువుగానిరా! నీకే తెలిసి వస్తుంది! ఇంకా దగ్గిరికి వెళ్ళిపోదాం పద!"

అని మంజుఘోష ఆమెను ప్రవరుని కింకా సమీపంగా తీసుకుపోయింది. వారతని సమీపంలోనే ఒక పొదరింటిమాటున నిలబడ్డారు. వరూధిని తిరిగీ పరిశీలనగా చూచింది.

ఆ చూపుతో ఆమె సందేహం అంతా పటాపంచలైపోయింది. అతడు ముమ్మూర్తులా ప్రవరుడే! ఏమీ సందేహంలేదు!

వరూధిని తన అదృష్టాని కెంతో మురిసి పోయింది. ఆమెకు శరీరమంతా తేలికై గాలిలో తేలిపోతున్నట్టొక ఆనందానుభూతి కలిగింది! మంజుఘోష నెంతో ఆప్యాయంగా కౌగలించుకొని చెవిలో చెప్పింది:

"మంజుఘోషా! నీవొక్కమా రాయన సన్నిధికి వెళ్ళి నాహృదయ వేదన అంతా వారికి విన్నవిస్తావా?"

"నేనా?" అని నవ్వింది మంజుఘోష.

"నీవే మరి! నీవుకాక నా కింకెవరున్నారే!"

ఎంతో దీనంగా బ్రతిమాలింది వరూధిని. ఆమెదీనస్థితి చూచేసరికి మంజుఘోషమనస్సు వెన్నపూసలా కరిగిపోయింది.

"సరే! నేను వెళ్ళి నా శాయశక్తులా చెప్పి చూస్తానుగాని తీరా నీవై ఎదటపడితేనేగాని ఆ ఛాందసబ్రాహ్మణుని హృదయం కరగ దేమో!" అని మంజుఘోష ప్రవరుని సన్నిధికి బయలుదేరింది.

ఆమె అక్కడినించి కదిలి వెళ్ళిపోయినప్పటినించీ వరూధిని అలాగే ఆ ప్రవరునికేసీ, మంజుఘోషకేసీ చూస్తూ నిలబడింది.

మంజుఘోషా ప్రవరులిద్దరూ వరూధినికి మాటలు వినబడీ వినబడ నంత సమీపంలోనే ఉన్నారు. ఆమె చెవులొగ్గి వారి మాటలేమైనా విస్పష్టంగా వినబడగలవేమోనని ఆశించింది. కాని వారి సంభాషణ ఆమెకంతగా విస్పష్టంగా వినిపించలేదు.

కాని కొంత సేపటికి ప్రవరుని పెదవిపై ఒక చిరునవ్వు వికసించింది. అది మొదట మల్లె మొగ్గగా కనిపించి, క్రమంగా పూవై రేకు తొడిగింది! ఆ చిరునవ్వు చూచేసరికి వరూధిని హృదయంలో ఒక చిన్న ఆశాముకుళం వికసించింది.

అదీగాక ప్రవరుని ముఖంలో అంతకు పూర్వం ప్రత్యక్షమైన నిర్దా క్షిణ్య రేఖ అంతా కరిగిపోయింది!

తరవాత మంజుఘోష తిరిగి వచ్చేదాకా వరూధిని అలాగే నిరీక్షిం చింది. పిమ్మట కొంతసేపటికి మంజుఘోష తిరిగి వచ్చింది.వచ్చీరాగానే వరూధిని ఎంతో ఆత్రంగా అడిగింది:

"ఏమైనదే నా మాట!" మంజుఘోష ఆ ప్రశ్నకు ఒక్క వేడి నిట్టూర్పుతో సమాధానం ఇచ్చింది:

"వరూధినీ! ఎంతటి కఠినాత్ముడే ఆ ప్రవరుడు! అలాంటి కొరక రాని కొయ్యను నే నెక్కడా కనీవినీ ఎరగనే తల్లీ!"

ఆ మాటతో వరూధిని దిగాలుపడిపోయింది! జిహ్వాగ్రంతో తడి ఆరిపోయిన పెదవి తడుపుకొని ఎంతో ఆత్రంగా అడిగింది: "అదేమే! అలాగంటున్నావు! ఇక మరి ఆశ ఏమీలేదా?"

"ఏమోనమ్మా! ఎంత చూచినా నాకేమీ ఆశ కనిపించడం లేదు!

కాని ఒక్కమాట! నీవే ఒక్క మా రాయనతో విన్నవించుకుంటే ఏమయినా కొంచెం మనసు కరుగుతుందేమో!"

పిమ్మట కొంత సేపటివరకూ నోటిమాట లేక వరూధిని దిగాలు పడి పోయి అలాగే నిలబడింది. తరవాత తిలోత్తమ, హరిణి మొదలైన చెలి కత్తెలంతా వరూధినిని వెతుక్కుంటూ అక్కడికి చేరుకొన్నారు. వారం దరూ జరిగినదంతా విన్నారు. హరిణి వరూధిని కతిరహస్యంగా ఏమేమో బోధించింది. ఆ మాటలతో వరూధినికి మళ్ళీ కొంచెం ధైర్యం చిక్కింది. సవిలాస మందగమనంతో ప్రవరుణ్ణి సమీపించింది.

అలా నడిచి వెళ్ళిందన్నమాటేగాని వరూధినికి మనస్సు మనస్సులో లేదు. కేవలం శరీరమే నడిచివెళ్ళింది. అసలే సంకోచంతో కుంచించుకు పోయిన ఆమె హృదయం సిగ్గుతోను, వేదనతోను చిమిడిపోయింది. తల వంచి కాలి బొటన వ్రేలితో నేలపై రాస్తూ ఏమేమో సణిగింది. తుద కా అన్నమాటల అర్థం ఆమెకే తెలియలేదు! చివరికి కన్నీళ్ళే ప్రవరుని కామె హృదయం వ్యక్తీకరించాయి. కొంచెం ధైర్యం తెచ్చుకొని తన మనోగత వేదన కొంత వరకూ అతని ఎదట వెళ్ళబోసింది.

ఆ ప్రార్థన విని ప్రవరు డొక్క నిట్టూర్పు విడిచిపెట్టాడు: ఇంటి దగ్గర తల్లిదండ్రులు, భార్యా పిల్లలు నా కోసం ఎదురు తెన్నులు చూచి చూచి ఎంతగా కుమిలి కృశించి పోయారో గదా! వా రంతా ఆవిధంగా కుమిలి కృశించిపోతుంటే నే నే విధంగా సుఖించగలనో చెప్పు!

"నే నేమో సన్యాసి ననుకుంటున్నావేమో! నే నేమీ అలాంటి సన్యాసిని మాత్రం కాను! కాని నా మన స్సీవిధంగా వికలమై పోయి నప్పుడు నేనెలా సుఖించగలను!"

ఆ చివరిమాటలో వరూధిని కేదో కొంచెం ఆశాంకురం మెరిసింది.

తల పైకెత్తి అతనికేసి చూచింది. అలవోకగా పైడి కుండలాల కొంతు లతని చిక్కని చెక్కిళ్ళపై తళుక్కుమని ప్రతిఫలించి ఫక్కుమని నవ్వాయి. వలెవాటుగా వేసుకొన్న సరిగంచు ఉత్తరీయంలోని యజ్ఞోప వీతం సన్నని బాలనాగు కుబుసంలా ప్రతిఫలించింది. పగడాలవంటి అధ రాలపై ప్రసరించిన చిరునవ్వు సంజవేళలో లేతలేత వెన్నెలలా తళతళ

లాడింది. వెంటనే వరూధిని నిట్టూర్చింది. ఆ నిట్టూర్పుతో ఆమె పంచ ప్రాణాలూ పైకెగిరిపోయినట్టుగా దిగాలు పడిపోయింది. రాని చిరునవ్వుతో చిట్టచివరి కీ విధంగా విన్నవించుకొన్నది:

"బ్రాహ్మణవరేణ్యా! నీ కించుకంతైనా చవిగాని దీనికోసమని ఇన్నిమారు లింతగా ప్రాథేయపడి నిర్బంధిస్తే మాత్రం ప్రయోజనమేమిటి! నీ ఆచారాలతోను, నిత్య నైమిత్తిక కర్మలతోను నీ విలాగే కలకాలం జీవించవలెననే నా కోరిక!

"ఇక నామాటా! నీమీది వలపుతో ఇలా కుమిలి కుమిలి కృశించడంకంటె మరణించడమే వేయిమడుగు లెక్కువ మంచిదని అనిపించింది!"

ఆ మాట లన్నదో లేదో, ఆమె రెండు కళ్ళూ కన్నీళ్ళు ప్రవహించాయి. వంచిన తల తిరిగీ పైకెత్తలేక పోయింది. ఆమె కిక నిట్టూర్పు విడిచే శక్తికూడా నశించి పోయింది.

ప్రవరుడామె దీనావస్థ పరిశీలించి ఒక దీర్ఘ నిశ్వాసం విడిచి పెట్టాడు.

"వరూధినీ! నే నీ జన్మలో ఈ శరీరంతో ఇక నా జన్మభూమి చేరుకోలేను గదా! చూడగా చూడగా నేను రెండింటికీ చెడ్డ రేవడనై పోయేటట్టున్నాను. నీ దైన్యం చూస్తే నా గుండె తరుక్కుపోతూంది. నీ విలా కాళ్ళావేళ్ళాపడి ప్రాథేయపడుతున్నావు కనక నీ కోసమైనా నా అసిధారావ్రతాలన్నీ గంగలో కలిపివేస్తాను మరి! ఏమి చెయ్యను! లేకపోతే, ఇక స్త్రీహత్యా మహాపాతకంకూడా నా కాళ్ళకు చుట్టుకొనేటట్టుంది!"

ఆ మాటలు చెవిని పడగానే వరూధిని హృదయం ఆనందంతో సొమ్మసిల్లి పోయింది. మళ్ళీ అడిగింది:

"మీరన్నమాట ముమ్మాటికీ నిజమేనా?"

"నిజమే వరూధినీ!"

అతడా మాట ముగించాడో లేదో - అంతలో ఆ పరిసరంలో పొదరిండ్లచాటున దాగిన వరూధిని చెలికత్తెలంతా అక్కడ గుమిగూడారు!

వారిలో ఒక అచ్చర కొంటెగా వరూధిని కేసి చూసి, ప్రవరుని చెక్కిలి కొట్టింది.

"ఈ చేదుమం దిక ఎలా దిగమింగుతారో పాపం!" అని కలకలా నవ్వింది.

హారిణి "ఎంత బెట్టుసరి చేశావయ్యా! ఇంతటి నెరజాణతనం ఎక్కడ నేర్చావయ్యా!" అని అలాగే ఆశ్చర్యపడింది.

మంజుఘోష వరూధినిని కౌగలించుకొని ఆమె ముంగురులు సవరించి, ప్రవరుని కేసి చూచింది.

"పాపం! అమాయకురాలిని చేసి మా వరూధిని నెంత బాధ పెట్టావు!" అని లేని కోపం తెచ్చిపెట్టుకొని కొరకొరలాడింది.

పిమ్మట అరణ్యంలో అంతటా వెన్నెల చిన్నెలు చెలరేగాయి. అచ్చరల పరిహాసా లా వెన్నెలతళుకులతో కరిగిపోయాయి.

3

వరూధిని ఆ మరునాడుదయమే శయ్యాగృహంలో నిద్రలేచి హేలగా కళ్ళు తెరిచింది. కాని ఆమెకు తెల్లవారినదనే నమ్మకమే కలగలేదు! మనోహరుని మనోహరమైన ఆనందస్వప్న లోకంలో తేలిపోతున్నట్లు తోచింది. ఆమె పార్శ్వంలో అలసి సొలిసి శయనించిన ప్రవరుని కెంతి ప్రయత్నించినా మరి కన్నులు విడనేలేదు!

వరూధిని ఆ శయ్యాగృహం అంతా కలయ జూచింది. వసంత ప్రాదుర్భావంలో కూడా గవాక్షాలపై తెల్ల తెల్లని మంచు తెర లింకా వేలాడుతూనే ఉన్నాయి. దూరదూరంగా దేవదారు తరువుల బారులపై పక్షుల కనస్వనా లప్పుడే మేలుకొన్నాయి. హృదయంలోని ఆనందశ్రుతిపై మారుమోగే ఆ విహంగాల కలస్వనా లామె కతిలోక స్వర్గ సంగీతంలా వినిపించాయి.

ఆ ఆనంద తన్మయతలో ఆమెశరీరం హంసతూలికలా తేలి

పోయింది. ఎంతో కష్టంమీద నొక్కి నొక్కి అడుగులు వేస్తే తప్ప ఆమె పాదాలిక నేలపై నిలబడనేలేదు!

ఒక్కొక్కప్పు డామె "నేను మేలుకొన్నానా, కలగంటున్నానా?" అని తనలో తానే ఆశ్చర్యపోయేది. మాటిమాటికీ కళ్ళు నులుముకొని నాలుగువైపులా పరికించేది.

అది కలగాదన్న విషయంలో ఆమెకేమీ అనుమానం కలగలేదు! కాని ఆ తీయని కల ఎప్పుడో హఠాత్తుగా కరిగి సురిగి పోతుందేమోననే భయం పట్టుకొని వేధించసాగింది.

"ఆహా! నా జీవితంలో దివ్యలైనా ఊహింపలేనంత మహానందం అనుభవించాను! ఈ మానవ లోకానందం ముందు ఆ దివ్య లోకానందం ఒక లెక్కా! దీనిముం దది దిగదుడుపే!" అని స్వర్గలోకానందం అంతా ఎందుకూ కొరగానిదని ఈసడించి వేసింది!

ప్రవరు డామెచనువు చెల్లించేముం దొక నియమం పాటించవలెనని కోరాడు. ఇద్దరూ ఏకాంతంగా ఉన్నప్పు డామె కళ్ళు తెరవకూడదని కట్టడిచేశాడు. అది తమ దేశాచారమనీ, అది పాటింపక తప్పదనీ బలవంతం చేశాడు. అదీగాక తన ఇష్టం లేనిదే ఆమె తన్ను విడనాడి పోకూడదని కూడా ఒక నియమం విధించాడు.

అత డలా ఎందుకు కట్టడి చేశాడో ఆమెకు తెలియలేదు! ఆ సమయంలో అది తెలుసుకోవాలనికూడా ఆమె కనిపించలేదు. ఆ రెండు కోరికలూ ఆమె కెంతో విచిత్రంగా వినిపించాయి! ఇక పూర్తిగా తనతో కలిసి మెలిసి ఉండడానికే అత డావిధంగా కోరుకొన్నాడని ఆమె ఊహించింది. కాని ఆ నాటిరాత్రి ఆనందం తలుచుకొని మరు క్షణంలోనే ఆ విషయం విస్మరించింది.

అలా రోజులు, వారాలు, మాసాలు గడిచిపోయాయి. అయినా నానాటికీ ఆమె జీవితానందం వేయిమడుగు లెక్కువే అయింది. ఆ ఆనందం అవధులు దాటిన కొద్దీ అది ఎప్పుడో ఒకప్పుడు హఠాత్తుగా చెయ్యిదాటి పోగలదేమోనన్న భయమే దానికొక అపూర్వ మాధుర్యం చేకూర్చింది.

ప్రవరుని నియమాలు పాటించడం ఆమెకేమీ కష్టమనిపించలేదు. శయ్యాగారంలో ప్రవరుని చిరునవ్వు సొగసు చూడగానే ఆమె శరీరం అంతా ఒక విశాల నేత్రమై వికసించేది! మరుక్షణంలోనే ఆనందభారంతో సొమ్మసిల్లి ముకుళించుకుపోయేది! ఇక ఆమె నేత్రాల మాట వేరే చెప్పనే అక్కరలేదు.

తన ఇష్టం లేనిదే తన్ను విడనాడి పోకూడదని ప్రవరు డొక కట్టడి చేశాడు. కాని ఆ కట్టడి విన్నప్పు డామె కలకల నవ్వింది! 'ఈయన ఎంతటి అమాయకుడు!' అని ప్రవరుని అమాయికత కెంతో ఆశ్చర్య పోయింది.

ప్రవరుడే ఎప్పుడో ఒకప్పుడు హఠాత్తుగా తన్ను విడనాడి పోగల డని ఆమె భయం! అందుచేత ఆ ఆనంద తన్మయతలో మైమరచి అతని ఒడిలోనే ప్రాణాలు విడిచి వెయ్యవలెననికూడా సంకల్పించింది. కాని అతని ముఖం చూచిన మరు క్షణంలోనే తనకు మృత్యువు లేదని, తా నమరకాంతనని ఆమె కెంతో సహజంగా స్ఫురించింది!

అలా మరికొంతకాలం గడిచిపోయేసరికి ప్రవరునిలోని ఆనందం క్రమక్రమంగా గ్రీష్మ శిరీష పుష్పంలా వాడడం మొదలు పెట్టింది. అత డెప్పుడూ ఏదో విషాద భావంతో క్రుంగి కుమిలిపోతున్నట్టు కనిపించే వాడు. అతని ముఖంలోని విషాదరేఖకు కారణమేమో ఆమెకు తెలియ లేదు. అరుణాస్పదపురంలోని తల్లిదండ్రులను, భార్యా పుత్రులను తలుచు కొని అత డావిధంగా కుమిలిపోతున్నాడేమోనని ఆమె అనుమానం! చివరి కొకనాడు ప్రవరుణ్ణి ప్రశ్నించింది. అతనొక నిట్టూర్పు విడిచి మాట్లాడ కూరుకున్నాడు. అంతేగాని సమాధానమేమీ చెప్పలేదు. క్రమ క్రమంగా ఆమె భయోద్వేగం పెచ్చు పెరిగిపోయింది.

కొన్నాళ్ళ కామెకు గర్భ సూచనలు కనిపించాయి. పట్టలేని ఆనందావేశంతో ప్రవరుని కా విషయం తెలియ జేసింది. ప్రవరు డది విని ఒక చిరునవ్వు నవ్వాడు. అంతే! అయితే ఆ నవ్వులో పూర్వ సంతోష రేఖ భాసించలేదు. దానితో వరూధిని ముఖం వెల వెల బోయింది.

4

ఆమె తనకు జన్మించబోయే శిశువు ముఖంలో తమ ఉభయుల సౌందర్య రేఖలూ కళ్ళారా చూచి ఆనందించవలెనని ఎంతో ఉవ్విళ్లూరింది. ఆ శుభముహూర్తంకోసం ఎంతో ఉత్కంఠతతో ఎదురుచూచింది. ఆ శిశువు తమ ఇరువురి అనురాగాలకూ అద్వైత మూర్తిగా అవతరించగలడని ఆశించింది. తన భావనలో ఆ శిశువు ముగ్ధముఖరేఖ లూహించి ముద్దుల వర్షం కురిపించింది.

కాని ప్రవరుని తాటస్థ్యము, విషాదము పరిశీలించినప్పు డామెలో ఆనందం అంతరించిపోయేది. అతని ముఖంలోని ఆ పూర్వోత్సాహాసందా లన్నీ క్రమక్రమంగా అదృశ్యమైపోయాయి. ఆ విషాదచ్ఛాయలు వరూధిని ముఖ రేఖలమీదకూడా ప్రసరించాయి.

ఒకనాడు ప్రవరు డెంతోసంతోషంతో వరూధిని దగ్గిరికి వచ్చాడు. అతని అపూర్వానందోత్సాహాలు చూచి వరూధిని నిర్ఘాంతపోయింది. విస్ఫారిత నేత్రాలతో ప్రశ్నార్థకంగా అతనివైపు చూచింది.

"అదృష్టవశాత్తూ నా కా పాదలేపం అనుగ్రహించిన సిద్ధపురుషు డీప్రాంతంలోనే ప్రత్యక్షమైనాడు. నా కా పాదలేప రహస్యం అంతా అనుగ్రహించాడు!'

అదివిని వరూధిని నిర్ఘాంతపోయింది. ఆ పాదలేపం వల్లనే ఆమెకు ప్రవరుని సందర్శనభాగ్యం కలిగింది. తిరిగీ దానివల్లనే వియోగం కలగగల దేమో అని భయపడింది. ఆమె ముఖం వెలవెల బోయింది. ఏమో చెప్ప బోయింది. కాని కంఠం గద్గదిక భారంతో స్తంభించిపోయింది.

ఆమె లోలోపలి దుఃఖవాహిని అంతా ఒక్కదూకుతో అడ్డుకట్ట పడగొట్టివేసి పరవళ్ళు దొక్కుతూ ప్రవహించబోయింది.

అంతలో ప్రవరు డామెను మృదువుగా కౌగలించుకొని మునివేళ్ళతో ముంగురులు సవరిస్తూ బుజ్జగించాడు.

"వరూధినీ! నే నింటిదగ్గిర లేకపోవడంవల్ల మా పాలాలు, పుత్రలు

అన్నీ వట్టి బీళ్ళయి చవుడుపట్టి పోయాయట! భార్య, పిల్లలు నామీదఆశలు వదులుకొని చిక్కి శల్యాలై కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకుని జీవిస్తున్నారట! అదీగాక ముక్కాలి ముదుసళ్ళయిన తల్లిదండ్రు లిద్దరూ నాకోసం కృశించి కృశించి మంచాలుపట్టి పోయారట! పాపం! ఆ సిద్ధపురుషుడు నా క్షేమ వార్త వారి కెరిగించి త్వరలోనే నన్నక్కడికి పంపిస్తానని వాగ్దానం చేసి వచ్చాడట!

"నా కిప్పు డా పాదలేపరహస్యం అంతా తెలిసిపోయింది గదా! నిమిషంలో వెళ్లి మా వాళ్ళ నందరిని చూచుకొని రెక్కలు కట్టుకొని మళ్ళీ మరు నిమిషంలోనే ఇక్కడ వచ్చి వాలిపోతాను! సరిగదా!"

అత డలా గన్నాడేగాని, ఎందుకో తడబడుతున్నట్లే కనిపించాడు. మాటిమాటికీ గొంతు తడి ఆరిపోయింది. కాళ్ళు వణికాయి.

వరూధిని విస్ఫారిత నేత్రాలతో అతని వైఖరి అంతా జాగ్రత్తగా పరిశీలించింది:

"ఆ సిద్ధపురుషు లిక్కడికి రావడము, మీ కా పాదలేపం ఇవ్వడము-అన్నీ వట్టి అబద్ధాలే. ఊరికే వేళాకోళాని కంటున్నారు! ఆ సిద్ధపురుషు లిక్కడికి వస్తే నా కా మాత్రం తెలియదనుకొన్నారా?" అని అతనిని గాఢంగా కౌగలించుకొన్నది.

"ఇది నిజమే! పరిహాసం కాదు!" అన్నాడు ప్రవరు డెంతో గంభీరంగా.

"నేను నమ్మను! ఇది నిజంకాదు! పరిహాసమే! తిన్నగా నావైపు చూడండి!" అని వరూధిని అతని ముఖం తనవైపు తిప్పుకొని నిశ్చలంగా అతని కళ్ళలోతులు కొలిచింది. ఆ పైన తాను నిజం కనిపెట్టి వేసిన ట్లువ్వెత్తుగా ఒక్క నవ్వు నవ్వింది.

ప్రవరుని కిక నోటమాట రాలేదు! నాలుక పిడచగట్టుకు పోయింది. అలాగే కొంచెం సేపుండి ఒక దీర్ఘనిశ్వాసం విడిచిపెట్టాడు.

"నీ వన్నది నిజమే వరూధినీ! సిద్ధపురుషు లిక్కడికి రానేలేదు! అదంతా నేనే కల్పించాను!"

"ఇన్నాళ్లుగా మీతో కలిసి మెలిసి తిరుగుతున్నానే! మీ సంగతి నా కామాత్రం తెలియదనుకొన్నారా!" అని సాభిప్రాయంగా నవ్వింది వరూధిని.

ప్రవరు డొక్క నిట్టూర్పు విడిచిపెట్టాడు. అతని ముఖం వాడి పోయింది.

"వరూధినీ! నీవు నా విషయం అంతా గ్రహించానని అనుకొన్నావు గాని నిజంగా నీకు నా స్వరూపం కొంచెమయినా తెలియలేదు! అది తెలిస్తే నీవు నిలువునా నిర్ఘాంతపోతావు! నీ శాపాగ్నితో నన్ను భస్మం చేసివేస్తావు! నే నిక నీ కంట బడడానికి గూడా అంగీకరించవు! తెలిసిందా?"

"అదిగో! మళ్ళీ పరిహాసం ప్రారంభించారు!"

"పరిహాసం కాదు! నిజమే చెబుతున్నాను! చెప్పి వేయమన్నావా?"

అతని ముఖ గాంభీర్యం పరిశీలించిన పిమ్మట వరూధినికి ప్రవరుని మాట నమ్మక తప్పలేదు! ప్రవరుడు తన కథ మొదలుపెట్టాడు:

"వరూధినీ! పూర్వం ఒకప్పుడు గంధర్వ కుమారు డొకడు నీపై మరులుకొని నీ పాదాలపై పడి ప్రార్థించాడు. ఆ విషయం జ్ఞాపకం ఉన్నదా?"

వరూధిని కా విషయం గుర్తుకు రాలేదు. జిజ్ఞాసార్థకంగా బొమముడి విరిచింది. కొంచెం సంకోచంతో తలవంచి అడిగింది.

"ఎవ రా గంధర్వ కుమారుడు?"

"కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమాలుకొన్నా నిర్దాక్షిణ్యంగా కసిరికొట్టి వేశావే! అతడు!"

"మణిభద్రుడా?"

"అవును! మణిభద్రుడే!"

"ఓహో! అతని మాటా మీరంటున్నది! అవును! ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. అయితే?" అని వరూధిని రెప్పపాటు లేకుండా ప్రవరునివైపు చూచింది! ప్రవరుడు తలవంచి ఆమె పాదాలవైపు చూచాడు:

"ఇప్పుడు నీ కెదురుగా ఉన్న వా డా మణిభద్రుడే!"

"ఉత్తది! నేను నమ్మను! చాలు! చాలు! మీ కొంటె పరిహాసాలు కట్టి పెట్టండి!"

అని హఠాత్తుగా వరూధిని అతన్ని తన బిగి కౌగిలిలో బంధించి వేసింది! ఆ కౌగిలిలో ప్రవరుని కిక ఊపిరే ఆడలేదు! అయినా అలాగే రొజ్జు కుంటూ నెమ్మదిగా పనిగాడు:

"కాదు! నిజమే! ముమ్మాటికీ నిజమే! నా మాట నమ్ము!"

"అయితే దీనికి తార్కాణం?"

"మనం ఇద్దరమూ ఏకాంతంగా ఉన్నప్పుడు నిన్ను కళ్లు మూసుకో మన్నాను జ్ఞాపకం ఉన్నదా?"

"అవును! జ్ఞాపకం లేకేమి?"

"ఆ సమయంలో నా గంధర్వ స్వరూపం బయటపడి పోగలదనే భయంతోనే నే నా కట్టడి చేశాను! నీ కింకా నమ్మిక కలగకపోతే వెంటనే నా స్వరూపం ధరించి వేస్తాను! నా స్వస్వరూపం ధరించమన్నావా?"

"వద్దు! వద్దు!" అని వరూధిని ఇంకా గాఢంగా అతన్ని కౌగలించు కొన్నది! కాని మరుక్షణంలోనే తన కౌగిలింత సడలించివేసి, కొంచెం దూరంగా నిలబడింది! ఆమె ముఖంమీద కత్తివాటు వేసినా నెత్తురు చుక్కలేదు! ప్రవరునికి వినబడీ వినబడనట్టుగా—'అయితే ఆ బ్రాహ్మణ కుమారు డేమైపోయాడు?"

అని ప్రశ్నించింది. ఆమె గొంతు తడి ఆరిపోయింది. కాని ఆ ప్రశ్న అతని హృదయంలో ఒక బాకులా పొడుచుకుంది.

"అగ్నిదేవుని అనుగ్రహం పొంది ఆ క్షణంలోనే తన అరుణాస్ప దాని కెగిరిపోయాడు."

"మరి మీ రీ స్వరూపం ఎలా ధరించగలిగారు?"

"దూరంనించి మీ ఇద్దరికీ మధ్య నడచిన వ్యవహారం అంతా పరిశీ లించాను! వెంటనే శాంబరీ విద్యతో నే నీ మాయాప్రవరుని స్వరూపం ధరించాను!"

"నిజమేనా?"

"నిజమే! వరూధినీ!" అని ప్రవరుడు తలవంచుకొన్నాడు.

ఆ మాట వినబడగానే వరూధిని 'అమ్మా' అని అక్కడే కుప్పగా కూలబడి పోయింది. అతనికేసి వెర్రిగా చూచింది. కాని దానిలో జీవ చైతన్యం అంతా సన్నగిల్లిపోయి కేవలం అణుమాత్రంగా నిలబడింది:

"వరూధినీ! నీ కీవిధంగా ఎంతైనా ఘోరద్రోహం చేశాను! అయితే నీమీది గాఢానురాగం వల్లనే నే నింతటి ద్రోహాని కొడిగట్టాను! నీ తీవ్ర శాపాగ్నిలో దహించివేస్తేనేగాని నా పాపాని కిక నిష్కృతిలేదు! ఆ శాపాగ్నిలో భస్మమై నా పాపపంకం కడిగి వేసుకోవాలనే సంక ల్పంతోనే ఇదంతా నీ కెరిగించాను! ఇక నీవు నన్నే విధంగానైనా సరే శపించి వెయ్యవలెననే నా ప్రార్థన."

అని మాయాప్రవరు డామె పాదాలపై వాలిపోయాడు. ఆ ఉత్తర క్షణంలో వరూధిని అతన్ని తీవ్ర శాపాగ్నిలో దహించి వెయ్యవలెననే సంకల్పించింది! ఆ తీవ్ర శాపం ఆమె నోటి చివరిదాకా వచ్చింది. అంతలో అతని దైన్యం చూడగానే ఆమెకు కొంచెం జాలివేసింది. లేకపోతే అత డక్కడే-ఆమె గాఢశాపాగ్నిలో దగ్ధమై పోవలిసిందే!

అంతలో ఆమెకు తన శిశువు విషయం జ్ఞాపకం వచ్చింది!

ఆ కుమారుడే స్వారోచిషమనువుగా అవతరింపగలడనీ, అతడు మానవ ధర్మప్రవక్త కాగలడనీ, మానవాళి కతని వాక్కు దేవవాక్కుగా వినిపింపగలదనీ హిమవన్నగ మహర్షు లాశీర్వదించారు. ఆ శిశువు జనకుడే ఆమె కెదురుగా నిలబడి ఉన్నాడు! దీనాతిదీనవదనంతో తన్ను శపించి వెయ్యవలిసిందని ప్రార్థిస్తున్నాడు! అతనికి, ఆమెకు మధ్య ఏర్పడిన మిథ్యానురాగబంధం మూలంగా జనించిన శిశువు కుమారుడే మానవాళి కిక ధర్మనిర్ణేతగా, ధర్మమూర్తిగా అవతరింప బోతున్నాడు!

ఆ మనువు ధర్మనిర్ణయంలో కూడా ఆ మిథ్యానురాగ ఛాయ లలాగే నిలిచిపోతాయేమో! మానవజాతి కంతటికీ ధర్మపురుషుడుగా అవత రించే అతని సంతతివా రందరికీ అలాంటి మిథ్యానురాగ భ్రాంతులే బయలు దేరుతూంటాయి కాబోలు! ఎంతటి హృదయ విదారకమైన విధివైపరీత్యం! అని వరూధిని లోలోపల కుమిలిపోయింది. ఆమె కాక్షణంలో మాయా

ప్రవరునితోబాటు తన గర్భంలో ఉన్న శిశువును కూడా తీవ్రశోకాగ్నిలో దహించివేసి వెంటనే ప్రాణ పరిత్యాగం చెయ్యవలెనన్న సంకల్పం కలిగింది.

కాని మళ్ళీ ఉత్తర క్షణంలోనే ఆ శిశువుమీద ఎంతో జాలి కలిగింది. ఆ జాలిలో అణుమాత్రం మాయాప్రవరునిమీద కూడా ప్రసరించింది. కాని మళ్ళీ కళ్లెత్తి అతనికేసి చూడలేకపోయింది.

"మణిభద్రా! నీవు నన్ను కళ్ళు మూసుకోవలసిందని కట్టడిచేశావు! నేనలాగే కన్నులు మూసుకొని మధురాతిమధురమైన స్వప్నలోకంలో మైమరిచాను! కాని అంతలోనే మళ్లీ నా కన్ను లెందుకు తెరిచావు! నీ వింతటి క్రూరుడవనీ, కఠినాత్ముడవనీ కలలోనైనా ఊహించలేదు! ఛీ! నా ఎదుట నిలవకు! పో!" అని ఆమె అతని పాదాల సమీపంలోపడి అదే పనిగా వెక్కి వెక్కి ఏడ్చింది! అలా ఎంతసేపేడ్చిందో ఆమెకే తెలియదు!

మళ్ళీ కొంతసేపటికి కళ్ళు తెరిచి చూచేసరికి అక్కడ మణిభద్రుడు కూడా కనబడలేదు!

మధురాతిమధురమైన వరూధిని స్వప్నం మంచు విడిపోయినట్టుగా కరిగి సురిగిపోయింది.

ఆ విధంగా యథార్థం చెప్పి వరూధిని కరుణ చూరగొనవచ్చుననీ, నిరంతరంగా ఆమె అనురాగ వాహినిలో ఓలలాడుతూ ఉండవచ్చుననీ గంధర్వ కుమారు డనుకొన్నాడు.

కాని అతని కలకూడా ఆమె చిట్టచివరి మాటతో కరిగిపోయింది!..